# ఊరికి నిప్పంటుకుంది

రోహిణీ కార్తె.

బాగా కాలిన యినప రేకులా తార్రోడ్డు సెగలు కక్కుతోంది. ఎక్కడా ఆకు అల్లాడ్డం లేదు. రోడ్డు వార చలివేంద్రం కింద మాగన్నుగా కునుకు తీస్తున్నాడు పెంటయ్య. పక్కనే ఎండు గడ్డి ఒత్తుగా పరచుకుని, దాని మీద వొళ్ళెరక్కుండా గుర్రు పెట్టి, నిద్ర పోతున్నాడు అతని పదేళ్ళ కొడుకు సింహాచలం. వాడి శరీరమంతా చెమటతో ముద్దగా తడిసి పోయి ఉంది. పందిరి మీద పరిచిన కొబ్బరి మట్టల్లోంచి ఒకటి రెండు సూర్య కిరణాలు సూటిగా వచ్చి వాడి మీద పడుతున్నాయి.

ఒంటరి ప్రయాణీకు డెవరో రొప్పు కుంటూ, రొజుకుంటూ వొస్తున్నట్టుగా ఓ బస్సు పెద్ద శబ్దం చేస్తూ వచ్చి ఆగింది. డ్రైవరు హారను 'బొయ్' మంటూ మ్రోగించాడు. తుళ్ళి పడి కళ్ళు తెరిచాడు పెంటయ్య. చప్పున లేచి, నించున్నాడు. నాలుగు గ్లాసులందుకుని, పక్కనే ఉన్న కుండ లోనుండి నీళ్ళు నింపి, గబ గబా బస్సు దగ్గరికి పరిగెట్టాడు. ప్రయాణీకులు ఆత్రంగా గ్లాసులందుకుని, నీళ్ళు తాగేరు. గ్లాసులు కడిగి, మళ్ళీ నాలుగయిదు సార్లు నీళ్ళందించేడు. దాహం తీర్చుకున్న ప్రయాణీకుల్తో బస్సు బయల్దేరి, మలుపు తిరిగి కనుమరుగయింది. ఉస్సురని నిట్టూరుస్తూ మళ్ళీ నేల మీద పరచి ఉన్న తుంగ చాప మీద చతికిల పడ్డాడు పెంటయ్య. మళ్ళీ లేచి, గ్లాసుల్ని చెక్క బల్ల మీద బోర్లించి ఉంచేడు. మూతలు తీసి, గూనల్లోకి చూసేడు. ఓ గూన పూర్తిగా ఖాళీ అయింది. రెండో దాంట్లో కొద్దిగా నీళ్ళున్నాయి.

టైమెంతయిందో! రెండవుతోంది కాబోలు! ఈ కాసిని నీళ్ళూ సాయంత్రం వరకూ ఎలాగూ చాలవు. ఏటి కెళ్ళి, మళ్ళీ నీళ్ళు తెచ్చి పోయాల్సిందే. ఈ ఎండలో కావిడి మోసుకుంటూ ఏటి నుంచి నీళ్ళు తేవడం తప్పదనే ఆలోచన వచ్చే సరికి పెంటయ్య గుండె జారిపోయింది. నీడ పట్టున ఈ పందిరి కింద కూచుంటేనే వొళ్ళంతా చిమ చిమలాడి పోతోంది. రోడ్డు మీద కాలు పెట్టడమంటే అగ్గి గుండం తొక్కినట్టే! ఫెళ్ళున కాస్తోంది ఎండ! ఎండ వేపు చూస్తేనే కళ్ళు మండి పోతున్నాయి. పెంటయ్య నిస్సత్తువగా నిట్టూర్చాడు. పొద్దున్నెప్పుడో తిన్న చద్ది కూడు. కడుపు నక నకలాడి పోతోంది. కాని, తప్పదు. ఏటి నుండి నీళ్ళు తేవాల్సిందే.ఇంకా చాలా బస్సులొస్తాయి.. అవి కాక లారీలూ, ట్రాక్టర్లూ, సైకిళ్ళమీద వెళ్ళే వాళ్ళూ, పని మీద ఇటు వేపొచ్చే జనం – ఒక రేమిటి! ఎవరో ఒకరు దాహంతో నీళ్ళ కోసం యిక్కడకి వొస్తూనే ఉంటారు.

ఎండలు ముదరక ముందు పొద్దున్నే కావిడితో నీళ్ళు తెచ్చి రెండు గూనల్లోనూ పోస్తే, సాయంత్రం వరకూ సరిపోయేవి. వచ్చీ పోయే వాళ్ళకి నీళ్ళందించే పని సింహాచలానికి అప్పగించి, తను ఆనకట్ట దగ్గర రివిటింగు పనికి వెళ్ళి పోయేవాడు. కానీ, రోజు రోజుకీ ఎండలు ఎక్కువై పోతూ ఉండడంతో ఎన్ని నీళ్ళూ చాలడం లేదు. ఉదయం తెచ్చి పోసిన నీళ్ళు మధ్యాహ్నం వరకూ కూడా సరి పోవడం లేదు. మళ్ళీ మధ్యాహ్నం ఎండలో ఏటికి పోయి నీళ్ళు తెచ్చి పోయాల్సి వస్తోంది.

ఎండా కాలం వచ్చిందంటేనే చాలు, తన లాంటి పేదోళ్ళకి పక్క బెదురే. ఆన కట్ట దగ్గర పనుండ బట్టి కానీ, లేక పోతే తనలాంటి వారికి కూలి పనే దొరకదిక్కడ. కూలి పని దొరకని రోజున కడుపులో కాళ్ళు పెట్టుకుని పడుకోవడమే. మరో దారి లేదు. తనూ, భార్యా, కొడుకూ – ముగ్గురూ కూలి తెస్తేనే కొంప గడిచేది. వేసవి ధర్మమా అని, భార్య పోలమ్మకి కూలి పన్లేవీ దొరకడం లేదు. ఊడుపులుంటాయా! కోతలుంటాయా! ప్చ్! పగిలిన గాజు పెంకుల్లా పొలాలన్నీ బీటలు వారి పోయి, వుంటాయి. ఆనకట్ట వుంది. ఏం లాభం? కాలువ లోని నీళ్ళన్నీ ఎగువున ఉన్న రావివలస నాయుళ్ళ పొలాలకే అందుతాయి. గంగమ్మ తల్లి పుట్టినింటి వాళ్ళ నొదిలేసి, మెట్టినింటి వాళ్ళనే సాకుతోంది.

తనొక్కడూ రెక్కలు ముక్కలు చేసుకుని కూలి చేసి తెచ్చిన డబ్బుతో నూకలు కొన్డవే కష్టమై పోతోంది. అలాంటి స్థితిలో పెద్ద బుగత చెంద్రి నాయుడి నుండి రమ్మని కబురొచ్చింది.

* * *

పెంటయ్య వెళ్ళే సరికి పెద్ద బుగత కుర్చీలో కూచుని చుట్ట తాగుతున్నాడు. పెంటయ్య నెమ్మదిగా అతని ప్రక్కకి చేరి విసన కర్ర అందుకుని విసురుతూ, “కబురెట్టార్ట!” అనడిగేడు, వినయంగా.

“వచ్చేవురా, పెంటయ్యా! రా! అలా కూచో... నీతో సిన్న పనుండి కబురెట్టాను. పర్లేదు కూకోరా!... సూడొరే, మన వూళ్ళో యువజన సంగం కుర్రాళ్ళంతా కలిసి నిన్న మీటింగెట్టుకుని, ఈ పాలి అమ్మ తల్లి సెట్టు కాడ సలివేంద్రాన్నెట్టి దార్న పోయే పేసింజర్లందరికీ తాగనానికి మంచి నీళ్ళిచ్చే యేర్పాటు చెయ్యాలను కుంటున్నార్రా! ...పిక్కిరోల్లు సెందాలు పోగు సేసుకుని, యీ యేసం కాలమంతా సలివేంద్రం నడపాలనుకుంటున్నారు. మంచి పట్టుదల మీద ఉన్నార్రా! మా పెద్దోడు ఆళ్ళ జట్టుకి లీడరు! తెల్సు కద! ఆళ్ళంతా మంచి పని సేస్తామంటే మనమేల కాదనాలి! ఏటంతావ్...?” అని ఆగేడు. “సిత్తం ...” తలూపేడు పెంటయ్య. “మరిగందుకని మాం పెద్దోల్లమంతా సర్లెమ్మన్నాం... కిందటయేడాదికి సెమ దానం సేసి, కోపటీదికి కంకర్రోడ్డు ఏసినావని సెప్పి, ఆ నరిసింహులు పార్టీ వోళ్ళు తెగ నీలుగు తున్నారు. ఈ పాలి మనం యీ సలివేంద్రాన్ని ఎట్టామంటే– మనూరోళ్ళూ, పొరుగూరోళ్ళూ కూడా సెబాసని మెచ్చుకుంటారు. దీన్తో ఆ ఎదవల నోళ్ళు మూయించాల! అందుకని రేపీయేలకి సలివేంద్రాన్ని

ప్రారంభించాలను కుంటున్నాం... రెండు గూనలూ, అరడజను గళాసులూ కొంటాం... నీళ్ళు పోసేందుకు జగ్గు కొంటాం...అమ్మ తల్లి సెట్టు కాడ నాలుగు రాటలేసి, దాని మీద కొబ్బరి మట్టలేస్తే అదే పంది రవుతాది. గూనలు పెట్టుకుందుకు మా యింటి కాడ నుండి బల్ల చెక్క వొట్టు కెళ్ళొచ్చు... మరి, నీళ్ళందించ నానికి ఓ కూలి మనిసుండాలి కద! అందుకే నిన్ను పిలిపించాను. ఆ కూల్డబ్బులు మరొకడికి ఎందుకు పోవాల! అందుకే నీకు కబురెట్టాను...నీకా, రోజూ నాల్రూపాయలు గిట్టు బాటవుతాయి... దాహంతో 'అలో లచ్చనా!' అని వొచ్చే వోళ్ళకి దాగం తీర్చిన పున్నెమూ వొస్తుంది! ... దిగ్గున ఫెడీల్మని కాసే ఎండ వేళప్పుడు నీళ్ళివ్వడం – వెయ్యి మందికి అన్న దానం సేసినంత పున్నెంరా, బాబూ! అవునా! అందుకన్నెప్పి, సాయంత్రం చల్ల బడ్డాక మన సేరీ కాడ కెళ్ళి నాలుగు రాటలూ, కొబ్బరి మట్టలూ వొట్టుకెళ్ళు. పందిరేసే పనిసూడు... మిగతా యేర్పాట్లన్నీ మాం సూస్తాంలే..." అని చెప్పేరు.

పెద్ద బుగత మాటకి తిరుగు లేదు. రాబోయే పుణ్యం కోసం కాక పోయినా, అతని మాటకి ఎదురు చెప్పే ధైర్యం లేక – పెంటయ్య సరే నంటూ తలూపేడు. ఆ సాయంత్రమే పెద్ద బుగత చెప్పిన చోట తనే పందిరి వేసాడు. మర్నాడు ఉదయాన్నే పెద్ద బుగత కంబారి రెండు గూనలనీ, గ్లాసులనీ, బల్ల చెక్కనీ ఒప్పగించి వెళ్ళాడు. పెంటయ్య యిసక మట్టులాగా వేసి, దాని మీద గూనల్ని జాగ్రత్తగా అమర్చేడు. బల్ల చెక్క మీద గ్లాసుల్నీ, నీళ్ళ జగ్గునీ ఉంచేడు. కావిడి భుజాన వేసుకుని,యేటికి వెళ్ళి నీళ్ళు తెచ్చి గూనలు నింపేడు. పందిరి చుట్టూ మావిడి తోరణాలు కట్టేడు.

ఎనిమిదవుతూ ఉంటే పెద్ద బుగత, అతని మనుషులూ, యువజన సంఘం కుర్రాళ్ళూ, ఊర్లో కొంత మంది జనం అక్కడికి చేరుకున్నారు. కొబ్బరి కాయ, ఊదొత్తులూ లాంటి పూజా సామగ్రి వచ్చింది. పంతులు గారొచ్చేరు. మంత్రాలు చదివేరు. పెద్దలకీ, కాబోయే నాయకులకీ దండలు వేసారు. ఉపన్యాసాలిచ్చేరు. చలివేంద్రం నిర్వహణ గురించీ, పెద్ద బుగత గొప్పదనం గురించీ, గ్రామ అభివృద్ధి గురించీ, రాబోయే ఎన్నికల గురించీ చాలా చెప్పారు. పెంటయ్యకి అవేమీ అర్థం కాక పోయినా, ఓ వారగా చేతులు కట్టుకుని, నిలబడి, జరుగుతున్న తతంగాన్నంతా చూస్తూ వుండి పోయేడు. మొట్ట మొదటి గ్లాసు నీళ్ళు పెద్ద బుగత స్వయంగా తన చేతుల మీదుగా యిచ్చేడు. అంతా చప్పట్లు కొట్టేరు. సభ ముగసేక అంతా వెళ్ళి పోయేరు. వెళ్ళే ముందు పందిరి బాధ్యతని పెంటయ్యకి ఒప్పగించేరు. "జాగర్త రారే, పెంటయ్యా! కుండలకి మూతలెడుతూ ఉండు... లేక పోతే బేపిలు మూతులెట్టీ గలవు... ఎంగిలి గ్లాసుల్ని ఎప్పటి కప్పుడు కడుగుతూ ఉండాల!..." అని హెచ్చరించి వెళ్ళాడు నాయుడు. పెంటయ్య వినయంగా తలూపేడు. మొదట్లో నీళ్ళుతెచ్చి పెట్టి, వచ్చి పోయే వాళ్ళకి నీళ్ళందించే పనికి సింహాచలాన్ని వుంచి, తను కూలి పనికి పోయే వాడు. నాలుగయిదు రోజులుగా బయట కూలి కూడా దొరకడం లేదు తనకి. అందు చేత తను కూడా పందిరి లోనే గడుపుతున్నాడు పెంటయ్య. అదీ కాక, మధ్యాహ్నం కావిడేసుకుని మరో సారి యేటి కెళ్ళి నీళ్ళు తేవాలి కూడా. చెవిలో ఆరి పోయిన చుట్ట పీక తీసి, కొంచెం

కొరికి, నోట్లో పెట్టుకుని అగ్గి పెట్టె తీసి వెలిగించుకున్నాడు. చుట్ట తాగుతూ కొడుకు వేపు చూసేడు. వాడు మొద్దు నిద్ర పోతున్నాడు. ఊపిరి తీసి నప్పుడల్లా వాడి డొక్కలు ఎగిరెగిరి పడుతున్నాయి. చిరిగి పోయిన నిక్కరు తప్ప, వాడి వొంటి మీద మరో గుడ్డ పీలిక లేదు. ఎండిన జనప నార కర్ర పుల్లలా ఉన్నాడు. రెల్లు దుబ్బులా పెరిగి పోయిన వాడి జుత్తు, ముఖాన్ని కప్పేస్తోంది. వాడిని చూస్తూ వుంటే జాలేస్తోంది పెంటయ్యకి. ఉదయం తన చేత ఎన్ని దెబ్బలు తిన్నాడో! పిచ్చెత్తినట్టు బాదేడు తను... ఏవిటో, వెర్రి కోపం వచ్చింది తనకి. నిన్న మధ్యాహ్నం ఏదో బస్సు వస్తే పేసింజర్లకి నీళ్ళు పట్టుకుని వెళ్ళేడు వాడు. ఇంతలో బస్సు కదిలి పోయింది. గ్లాసు లందుకో బోతూ వుంటే, రెండు గ్లాసులు బస్సు టైర్ల కింద పడి నలిగి పోయేయి. దానికి తోడు సాయంత్రం ఆ నరిసింహులు నాయుడు పార్టీ మనుషులు వచ్చి చేసిన హడివిడిలో నీళ్ళ జగ్గూ, మరో గ్లాసూ మాయమై పోయేయి. సంగతి విని, పెద్ద నాయుడు కోపంతో 'ధూం ధాం' లాడేడు.

కూలి డబ్బులు విరక్కొడతానని బెదిరించి, ఎలాగో బతిమాలితే శాంతించేడు.. ఆ బాధతో యింటి కొచ్చి, కోపంతో కొడుకుని పశువుని బాది నట్టు బాదేడు. 'ఛ! ఎదవ జన్మ!' బాధగా నిట్టూర్చాడు పెంటయ్య.

* * *

దుమ్ము రేపుకుంటూ ఓ బస్సువచ్చి ఆగింది. అందులో నుంచి కరణం దిగేడు. అతను పెద్ది నాయుడి పార్టీ మనిషే. బస్సు దిగుతూనే పందిరి నీడ కిందకి వచ్చేడు "హమ్మయ్య! ఏ వెండరా బాబూ! తల బద్దలై పోతోంది." అంటూ విసుక్కున్నాడు. పై మీది కండువాతో ముఖం తుడుచు కున్నాడు. పెంటయ్యని నీళ్ళు యిమ్మన్నాడు. పెంటయ్య గ్లాసు కడిగి, నీళ్ళందించేడు. కరణం గ్లాసందుకుని, నీళ్ళు తాగ బోతూ ఆగి పోయేడు. అతని ముఖం జేవురించుకు పోయింది. కోపంగా గ్లాసుని నేల కేసి కొట్టాడు. పెంటయ్య బిక్క చచ్చి పోయేడు. "ఏట్రా యీ నీళ్ళు? బురద నీళ్ళు పట్టుకొచ్చేసేవేటి! నీ మొహం తగలెయ్య! నీకు పొగరెక్కువయిందిరా గాడిద! కుండలో నీళ్లు అడుగంటి పోతే, మళ్ళీ నీళ్ళు తెచ్చి పొయ్యాల! కానీ, అడుగు బొడుగు నీళ్ళు నాలాంటోళ్ళకి యిస్తావా! ఏట్రా, నీ ధైర్యం? మల్లి రోజుకి నాలుగు రూపాయలు కూలి తీసుకుంటున్నావు! పెద్ది నాయుడితో చెప్పి, కీళ్ళి రిపించీమంటావేటి !" అంటూ యింతెత్తున ఎగిరేడు. "తప్పయి పోనాది బాబూ!..." తల దించుకుంటూ భయం భయంగా అన్నాడు పెంటయ్య. "మీ పేదోళ్ల కున్న పోయే కాలమేరా, యిది! కూలి పని కావాలంటే మా గడపలంట కుక్కల్లా పడేడుస్తారు... పోనీ కదా అని, పనిప్పిస్తే కళ్ళు నెత్తి కెక్కి సరిగా చేసు కోరు..." అంటూ రుస రుసలాడుతూ వెళ్ళి పోయేడు కరణం.

పెంటయ్య గుండె భయంతో వేగంగా కొట్టుకుంది. బాధగా నిట్టూర్చాడు. సింహాచలాన్ని తట్టి లేపాడు. "నెగరా, నెగు! నీళ్ళయి పోయేయి... నెగు.. మేలుకుని జాగర్తగా చూస్తూండు ... నేను ఏటి కెళ్ళి నీళ్ళట్టు కొస్తాను..." అన్నాడు. వాడు బద్ధకంగా లేచి,

కూచున్నాడు. కావిడి భుజాన వేసుకుని, ఏటికి బయలు దేరాడు పెంటయ్య. ఊరికి అరమైలు దూరంలో ఉంది యేరు. ఆ ఊరంతటికీ ఆ యేటి నీరే ఆధారం. ఎంత బాధయినా వేరే దారి లేదు. నెత్తి మాడి పోతున్నా, భారంగా నడుస్తూ అడుగు లేస్తూ, యేటి వేపు వెళ్తున్నాడు పెంటయ్య. కాళ్ళు బొబ్బ లెక్కి పోతున్నాయి. అడుగు తీసి, అడుగు పెట్టడం కష్టంగా ఉంది. నీరసం కమ్ము కొస్తోంది. గొంతు ఆర్చుకు పోతోంది. దాహంతో అవురావురు మంటూ వచ్చే వాళ్ళకి - చల్లని నీళ్ళందివ్వడం కోసం, నిప్పుల గుండం లాంటి ఆ రోడ్డు మీద కావిడి మోసుకుంటూ నడుస్తున్నాడు పెంటయ్య.

ప్రజా సేవా కార్యక్రమంలో -

తమ పార్టీ వాళ్ళు యీ యేడాది చలివేంద్రం నిర్వహించ గలుగు తున్నందుకు - అది గ్రామంలో తమ పరపతిని పెంచి, సంపాదించి పెట్ట గల ఓట్లని తల్చుకుంటూ పొంగి పోతున్న మనుషుల గురించి కానీ- తన కష్టానికి చాలని కూలి డబ్బుల గురించి కానీ - చెయ్యని తప్పుకి చావు దెబ్బలు తిన్న సింహాచలం గురించి కానీ - కళ్ళలోకి వచ్చిన ప్రాణాలతో తను నూకలు తెస్తానని ఆశతో పిచ్చిగా ఎదురు చూసే భార్య పోలమ్మ గురించికానీ పెంటయ్య యిప్పుడాలోచించడం లేదు. ఇందాక కరణం అన్న మాటలే గుర్తొచ్చి, అతని గుండె దహించుకు పోతోంది. ఆ బాబు యీ విషయం పెద్ద బుగతతో చెప్తే - ఆ బుగత తనని తిట్ట బోయే దృశ్యం ఊహకొచ్చి జలదరించుకు పోతున్నాడు.

ఎండ వేడికి నల్లగా వికృతంగా తయారై, చెమట్లు కారి పోతున్నాడు పెంటయ్య. పీక్కు పోయిన అతని ముఖంలో కళ తప్పి పోతోంది. అతని వొళ్ళు స్వాధీనం తప్పుతోంది. రోడ్డు దిగి, ఏటి యిసకలో కాలు పెట్టాడు. ఇసకలో అతని కాళ్ళు బలంగా కూరుకు పోతున్నాయి. "సర్...సర్..." మని ఇసక చప్పుడు చెవులకి కర్కశంగా వినిపిస్తోంది. పెంటయ్యకి కళ్ళ ముందు ప్రపంచం గిర్రున తిరిగి నట్లయింది. అతని చెవుల్లోనుంచి వేడి సెగలు మొదలయ్యేయి. అతని కళ్ళ ముందు పచ్చని చేలన్నీ అకారణంగా భగ్గున మాడి మసై పోతున్నట్టూ... నోరూ వాయీ లేని పిట్ట లేవో టప టపా నేల రాలి పోతున్నట్టూ... ఫెళ ఫెళా చెట్లన్నీ కూలి పోతున్నట్టూ... కనిపిస్తున్న ఏటి పాయ కనిపించని మృత్యువు లాగానూ తోచింది. ఇసక మీద వేడి గాలి సుడులు తిరుగుతూ, గాలి దెయ్యా లేవో వికటంగా నృత్యం చేస్తున్నట్టు కనిపించింది. ఒక్క సారిగా అతని సమస్త యింద్రియాలూ స్తంభించి పోయి నట్టయింది. వడ దెబ్బకి తట్టుకో లేక, ఆ మండే యిసక మీద కుప్పలా కూలి పోయేడు పెంటయ్య. జీవం లేని నవ్వు లాగ ఏటి చాలు ఎండలో మెరుస్తోంది.

* * *

సరిగ్గా అదే సమయానికి -

బస్సు దిగి, పందిరి నీడ కొచ్చేడు నరసింహులు నాయుడు. సింహాచలాన్ని నీళ్ళడిగేడు. వాడు బిత్తర పోతూ, బెదురుగా చెప్పాడు: "నీళ్ళు నేవు బాబూ!... అయి పోనాయి... ఇప్పుడే నీళ్ళు తేదానికి అయ్య కావిడేసుకుని ఏటికెళ్ళాడు..." అని.

ఎండన పడి వచ్చాడేమో, దాహంతో విల విలలాడి పోతూ, ప్రత్యర్థి వర్గాని దని కూడా చూడకుండా వచ్చిన నరసింహులు నాయుడు ఆ మాటలతో ఉగ్రుడై పోయేడు. చిందులు తొక్కడం మొదలెట్టాడు. చంద్రి నాయుడు పార్టీ వాళ్ళ మీద దుమ్మెత్తి పోసే యీ అవకాశాన్ని అతడు వదులుకో దల్చ లేదు.

"నీళ్ళు నేవూ! మరి దేనికయితే వున్నావురా, పిడత ముకం ఎదవా! ఎవడి గొప్ప కోసంరా మీ ఎధవలంతా కల్సి యీ చలివేంద్రువెట్టి నార్రా కుక్కల కొడకా! పెద్ద పోటు గాళ్ళలా పెట్టార్రా చలివేంద్రం!" అని బూతులు తిడుతూ అక్కడున్న వస్తువులన్నింటినీ ఎడా పెడా తన్ని, చిందులు వేసాడు నరసింహా నాయుడు. నాయుడి వెంట వచ్చిన అతని మనుషులు వీరంగం ఎత్తారు.

చలివేంద్రం ఫెళ ఫెళా కుప్ప కూలి పోయింది!

అంతే! ...

ఊరికి నిప్పంటుకుంది.

* * *

*ఆంధ్ర భూమి సచిత్ర వార పత్రిక 30-8-1979 సంచికలో ప్రచురణ.*
*ఆంధ్ర భూమి వారు నిర్వహించిన కథల పోటీలోమూడవ బహుమతి పొందిన కథ.*